

నేటి నుంచి మండల, మునిసిపల్ స్థాయిలో 'మీకోసం'

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. 'మీ కోసం' కార్యక్రమాన్ని సోమవారం నుంచి మండల, మునిసిపల్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మునిసిపల్ కార్యాలయాలలో సమర్పించాలని సూచించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజాఫిర్యాదుల వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిల్లో వికేంద్రీకరించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.



క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

ఆదిత్యుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం.. మూడో ఆదివారం సందర్భంగా అరసవల్లిలో ఆదిత్యుడ్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. కేశఖండనశాల, ప్రసాదాల కౌంటర్ల వద్ద అధిక రద్దీ కనిపించింది. ఆదివారం ఒక్కరోజే స్వామికి రూ.8.99.862 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.4,21,200, విరాళాల ద్వారా రూ.1,66,572, ప్రసాదాల రూపంలో రూ.3,12,090 లభించినట్లు ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. ఇదిలా ఉండగా ఇంద్రపుష్కరిణి వద్ద నీరు కలుషితంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.



- పాఠశాల విద్యాశాఖలో సమూల మార్పులు
- విలీన తరగతులు, పాఠశాలలు వెనక్కి
- మండలానికి ఒకరే ఎంఈవో
- పర్యవేక్షణ బాధ్యత హెచ్ఎంలదే
- కసరత్తు చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రక్షాళన దిశగా!

ఇచ్ఛాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):

పాఠశాల విద్యాశాఖలో సమూల ప్రక్షాళనకు కూటమి ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. వైసీపీ పాలనలో పాఠశాల విద్యాశాఖ అస్తవ్యస్తంగా మారింది. పూటకో జీవో, రోజుకో ఉత్తర్వులతో ఉపా ధ్యాయులను, విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అనా లోచిత నిర్ణయాలతో కొన్ని ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా మూతపడేలా చేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత తప్పిదాలను సరిచేస్తూ ముందుకు సాగుతోంది. పాఠశాలలకు పూర్వవైభవం తెచ్చేలా చర్యలు చేపడుతోంది.

- వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలతో లాభం కంటే నష్టాలే అధికం. అప్పట్లో ఇద్దరు ఎంఈవోలను నియమించారు. దీంతో చాలా మండలాల్లో ఆధిపత్య పోరు నడిచింది. అది పాలనతో పాటు పాఠశాలల పర్యవేక్షణపై ప్రభావం చూపింది. అందుకే ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాత విధానంలోనే మండలానికి ఒక ఎంఈవోను పరిమితం చేయాలని భావిస్తోంది. ఉన్నత పాఠశాలల హెచ్ఎంలకు కీలక బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది.
- గతం మాదిరిగా స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేయనుంది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 50మంది ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టనుంది. ఇప్పటివరకూ ప్రతి మండలంలో 10 నుంచి 12 వరకూ స్కూల్ కాంప్లెక్సులుండేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వాటి సంఖ్య సగానికి తగ్గే అవకాశం ఉంది. నిర్దేశిత సంఖ్యలో ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైతే బోధన, ఇతరత్రా అంశాలపై ఉపాధ్యాయులకు మరింత అవగాహన పెరిగే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు తూతూమంత్రంగా జరిగాయి. పాఠశాలలపై హెచ్ఎంల పర్యవేక్షణ కూడా తగ్గింది. దీంతో విద్యాబోధన, పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపింది. అందుకే తిరిగి హెచ్ఎంలకే పర్యవేక్షక బాధ్యతలు అప్పగించనున్నారు.



● అనాలోచిత నిర్ణయాలు..

'నాడు-నేడు' పథకంతో పాఠశాలల స్వరూపాన్నే మార్చేశామని వైసీపీ పాలకులు చెప్పుకొచ్చారు. కానీ ఏకంగా 233 పాఠశాలలను పక్క స్కూళ్లలో విలీనం చేసి చాలా గ్రామాల ప్రజలకు అన్యాయం చేశారు. తరగతుల విలీనం పుణ్యమా అని 485 పాఠశాలల్లో 10 మంది లోపే విద్యార్థులు ఉన్నారు. అందులో కూడా ఒకరిద్దరు పిల్లలు ఉన్న పాఠశాలలు కూడా ఉన్నాయి. ఒకటి, రెండు తరగతుల్లో చేరికల సంఖ్య తగ్గుముఖం పట్టింది. మూడో తరగతికి వస్తే మరో పాఠశాలలో చేర్పాల్సి ఉండడంతో తల్లిదండ్రులు కూడా పెద్దగా ఆసక్తి చూపలేదు. ప్రైవేటు బడుల వైపు మొగ్గుచూపారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు ఖాళీగా కనిపించాయి. ప్రస్తుత ప్రభుత్వం.. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నత పాఠశాల ఉంటే ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని భావిస్తోంది. పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసి.. తరగతికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమించాలన్న ప్రతిపాదనపై కూడా దృష్టి సారించింది.

● జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,915 ఉన్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు 315 వరకూ ఉన్నాయి. ఉన్నత పాఠశాలలు 419 కొనసాగుతున్నాయి. వీటిలో 1.60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. అయితే విద్యార్థులు లేరన్న సాకుగా చూపి జిల్లాలో 223 పాఠశాలలను సమీప స్కూళ్లలో విలీనం చేశారు. పది మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు ఏకంగా 485 ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఇన్ని సమస్యలు ఉంచుకొని పాఠశాలల స్వరూపాన్నే మార్చేశామని గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. నాడు-నేడు పథకం కింద పనులు చేపట్టిన వందలాది పాఠశాల భవనాలు కూడా వృథాగా ఉన్నాయి. పాఠశాలలతో పాటు తరగతులను వెనక్కి రప్పించే ఏర్పాటులో కూటమి ప్రభుత్వం ఉంది. వచ్చే విద్యాసంవత్సరానికి ఈ ప్రక్రియ పూర్తికానుంది.

● తరగతులను వెనక్కి రప్పించాలి..



విలీన తరగతులను వెనక్కి రప్పించాలి. ప్రాథమికోన్నత పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి. ఇందుకు సంబంధించి 117 జీవోను రద్దు చేయాలి. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని అమలుచేయాలి. ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించాలి.

-అనంతాచార్యులు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

● రెండంచెల విధానంతో మేలు..

ప్రాథమిక విద్య అస్తవ్యస్తంగా మారింది. తరగతుల విలీన ప్రక్రియతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి రెండంచెల విధానమే మేలు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను విభజించాలి. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.

-ఉమాశంకర్, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ధాన్యం.. ఎక్కడైనా విక్రయించవచ్చు

- రైతుల శ్రేయస్సే ప్రాతిపదికగా కొనుగోలు కేంద్రాలు
- సివిల్ సప్లయిస్ డీఎం శ్రీనివాసరావు

కోటబొమ్మాళి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రాతిపదికగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. పండించిన ధాన్యాన్ని రైతులు నచ్చిన మిల్లుకు విక్రయించుకోవచ్చ'ని సివిల్ సప్లయిస్ డీఎం కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక కో-ఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో 420 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. 4.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించాం. 80కేజీల బస్తాకు రూ.1,840 మద్దతు ధర (మిగతా 8వ పేజీలో..)

జగనన్న ప్లాట్ల అమ్మకాలు

- ఇష్టారాజ్యంగా కేటాయింపే కారణం
- చోద్యం చూస్తున్న అధికారులు

సరుబుజ్జిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):

వైసీపీ పాలనలో మంజూరు చేసిన జగనన్న ప్లాట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇళ్లులేని వారికి కాకుండా వైకాపా అనర్హులకు కేటాయించడమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇళ్లు ఉన్న ఎంతోమంది వైసీపీ కార్యకర్తలతో పాటు ఇతర ప్రాంతాల్లో భారీ భవంతులు ఉన్న వారికి కూడా వైసీపీ నాయకుల జోక్యంతో ఈ పాట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో 22 లేఅవుట్‌లు ఏర్పాటు చేసి 618 మందికి ఇంటి స్థలాలు కేటాయించారు. వీటిలో 266 ఇళ్లను గృహ నిర్మాణశాఖ మంజూరు చేసింది. చిగురువలస, కొత్తకోట గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ప్లాట్లు మంజూరు చేయలేదు. పురుషోత్తపురం గ్రామ సచివాలయ పరిధిలో 120 ప్లాట్లు మంజూరు చేయగా ఇక్కడ పది ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. సరుబుజ్జిలి గ్రామ సచివాలయ పరిధిలో రెండు లేవుట్‌లలో 79 ప్లాట్లు మంజూరు చేయగా ఇక్కడ 25 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మతలబుపేట గ్రామ సచివాలయ పరిధిలో 42 మంది లబ్ధిదారులు ఎంపిక చేసి ప్లాట్లు మంజూరు చేయగా ఇక్కడ ఒక ఇల్లు కూడా కాలేదు. 266 మంది లబ్ధిదారులు ఉండగా 90 ఇళ్లు పూర్తి అయినట్లు గృహ నిర్మాణశాఖ గణాంకాలు చెబుతున్నాయి.



నిర్మాణాలు చేపట్టినా సౌకర్యాలకు నోచుకోని సరుబుజ్జిలి లేఅవుట్



మతలబుపేట లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జోరుగా ప్లాట్లు అమ్మకాలు..

సరుబుజ్జిలి గ్రామ పంచాయతీ నందికొండ రెవెన్యూ పరిధలో మంజూరు చేసిన జగనన్న ప్లాట్లకు గిరాకీ పలుకుతోంది. ఇక్కడ ఇళ్లు అవసరం లేని కొంతమంది లబ్ధిదారులను ఎంపిక చేయడంతో.. వారు పునాదుల వేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. మండలంలోని పలు గ్రామ సచివాలయ పరిధిలో నిర్మాణాలు చేపట్టకముందే ఖాళీ స్థలాలు చేతులు మారుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిధుల దుర్వినియోగం..

మండలంలో కొన్ని లేఔట్లలో నిర్మాణాలు చేపట్టకున్నా రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు. నిర్మాణ పూర్తి చేసుకున్న లేఅవుట్‌లకు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించలేదు. అప్పట్లో స్థానిక వైసీపీ నాయకుల ఒత్తిడి వల్లే అధికారులు ఇలా చేశారని తెలుస్తోంది.

- మండలంలో గత ప్రభుత్వంలో మంజూరు చేసిన జగనన్న ప్లాట్ల అమ్మకాలు తమ దృష్టికి రాలేదని, అలాంటివి జరిగితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.మధుసూదన్ తెలిపారు. ఇళ్ల నిర్మాణం 2025 మార్చి 31వ తేదీ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. లేకపోతే ఇంటి స్థలాలను స్వాధీనం చేసుకుని అర్హులైన లబ్ధిదారులకు ఇస్తామన్నారు.



టూనా చేపలను ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు



మత్స్యకారులకు చిక్కిన టూనా

- భావనపాడు తీరంలో ఒకేరోజు పది టన్నులకు పైగా చేపలు లభ్యం

టెక్కలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భావనపాడు సముద్రతీరంలో మత్స్యకారులకు భారీగా టూనా చేపలు లభ్యమయ్యాయి. ఏటా ఈ సీజన్‌లో ఈ చేపలు రింగు వలలకు అరుదుగా చిక్కుతుంటాయి. ఈ తీరంలో మత్స్యకారులు 48బోట్లలో రింగుల వలలు వినియోగిస్తున్నారు. ఒక్కో బోటుకు సుమారు 15 మంది మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్తారు. కాగా.. శనివారం రాత్రి మత్స్యకారులు చేపలవేటకు వెళ్లి.. ఆదివారం తిరిగి రాగా.. పది టన్నులకుపైగా టూనా చేపలు లభ్యమయ్యాయి. ఒక్కరోజే భారీగా టూనా చేపలు లభ్యమవడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బారువా తీరం నుంచి మొగదలపాడు వరకూ నాలుగు బోట్లలో వలలకు మాత్రమే టూనా చేపలు చిక్కాయని మత్స్యకారులు తెలిపారు. మిగిలిన బోట్లలో కోణేము, వంజరాలు, కొమరమొయ్యలు, సురలు, కానాగర్తలు, చిన్నరకాల చేపలు లభ్యమయ్యాయన్నారు. కాగా టూనా చేపలకు విదేశాల్లో డిమాండ్ అధికంగా ఉందని.. జపాన్‌లో కిలో రూ.400 నుంచి రూ.500 వరకూ కొనుగోలు చేస్తారని తెలిపారు. ఇక్కడ కోల్డ్‌స్టోరేజీ, ఇతర సౌకర్యాలు లేక.. ఈ చేపలపై ఆసక్తి కూడా (మిగతా 8వ పేజీలో..)

ఘనంగా సుందరకాండ పారాయణం
● 1016 మంది మహిళలతో నిర్వహణ
● వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు
శ్రీముఖలింగంలో బాలియాత్ర
● దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు
8లో





గార: మొగదాలపాడు బీచ్‌లో పర్యాటకుల సందడి



వజ్రపుకొత్తూరు: శివసాగర్ తీరంలో..

బీచ్‌లో పిక్నిక్ సందడి

గార/వజ్రపుకొత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో ఆదివారం కే.మత్స్యలేశం, మొగదాలపాడు బీచ్‌ల్లో పర్యాటకుల సందడి కనిపించింది. పిక్నిక్‌లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి చిన్నారులు, పెద్దలు తరలివచ్చారు. సమీప తోటల్లో వనసమారాధన నిర్వహించారు. సముద్రతీరంలో కేరింతలు కొడుతూ స్నానాలు ఆచరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు. అలాగే వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలోని శివసాగర్ తీరంలో పర్యాటకులు సందడి చేశారు.



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. భూల్ భులాయా (భూల్ భులాయా3)
3. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
4. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
5. జా రాంఝన్ (దో పత్తీ)
6. ఆయీ నై (స్త్రీ-2)
7. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
8. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. అపనా బనాలే (భేడియా)
10. మిలియనీర్ (గ్లోరీ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

సెలబ్ టాక్

దేనికైనా రెడీ..!



బాలీవుడ్‌లోకి మరో వారసురాలు వచ్చింది.
ఆమె ఎవరో కాదు... హీరో వరుణ్ ధావన్ అన్న కూతురు...
'బిన్ని అండ్ ఫ్యామిలీ' కథానాయిక... అంజినీ ధావన్.
వెండితెరపై వెలిగిపోవాలన్న ఆశయంతో... కొన్నేళ్లు
పరిశ్రమలోనే పని చేసి... అనుభవం గడించింది.
తొలి చిత్రంతోనే మంచి హిట్ సొంతం చేసుకోవడమే కాదు...
అగ్ర నటుల ప్రశంసలు కూడా అందుకుంది.

అంజినీ ఇంట్లో అందరూ సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్నవారే. తాతయ్య అనిల్ ధావన్ వెటరన్ నటుడు. ఆయన కుమారుడు, అంజినీ తండ్రి సిద్ధార్థ్ ధావన్ బుల్లితెర నటుడు. హిట్ చిత్రాల దర్శకుడు డేవిడ్ ధావన్ పినతాత. డేవిడ్ తనయుడు, ప్రముఖ హీరో వరుణ్ ధావన్ ఆమెకు వరుసకు బాబాయి. చిన్నప్పటి నుంచీ సినీ వాతావరణంలోనే గడిపిన అంజినీకి సాధారణంగానే నటనపై మక్కువ పెరుగుతూ వచ్చింది. ముంబయిలో పుట్టి పెరిగిన ఆమె... డిగ్రీ తరువాత కెరీర్‌పై పూర్తి శ్రద్ధ పెట్టింది. అయితే కుటుంబ నేపథ్యం, ఇంట్లోవాళ్ల ప్రోత్సాహం ఉన్నా... తొలుత తనను తాను పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకోవాలని అనుకుంది. ఆ తరువాతే తెర మీద కనిపించాలనే పట్టుదలతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పరిశ్రమలో అడుగుపెట్టింది. వరుణ్ ధావన్ 'కూలీ నంబర్-1'కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసింది. అప్పుడప్పుడూ బామ్మ రష్మీ ధావన్ యాక్టింగ్ స్కూల్లోని విద్యార్థులతో కలిసి నటనలో మెళకువలు కూడా నేర్చుకుంది. ఇలా ఎక్కడ అవకాశం దొరికినా దాన్ని ఉపయోగించుకొంటూ... తనలోని నటికి మరిన్ని వన్నెలద్దింది. వీటన్నిటి ఫలితం తొలి చిత్రం 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లోనే కనిపించింది. సినిమా చూసినవారందరూ... ఆమెకు అది మొదటి సినిమా అనుకోలేదట. అంతలా అదరగొట్టింది నటనలో. ఇక ఎంతో సహజంగా నటించిందనేది విమర్శకుల మాట.

వేరొక ఆడిషన్‌లో చూసి...

'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం కూడా విచిత్రంగా వచ్చింది అంజినీకి. "వేరొక సినిమా కోసం ఏడాదిగా ఆడిషన్లు ఇస్తున్నా. అది సంజయ్ త్రిపాఠీ దృష్టిలో పడింది. తను తీయబోయే చిత్రంలో 'బిన్ని' పాత్రకు నేనైతే సరిగ్గా సరిపోతానని ఆయన భావించారట. వెంటనే నన్ను ఆడిషన్స్‌కు పిలిచారు. నా నటన నచ్చింది. అలా 'బిన్ని అండ్ ఫ్యామిలీ'లో అవకాశం రావడమే కాదు... నటిగా నా కెరీర్ కూడా ప్రారంభమైంది" అంటూ ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది అంజినీ.



'నా జీవితానికి దగ్గరైన పాత్ర'...

ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలను లండన్‌లో చిత్రీకరించాడు సంజయ్. నెల రోజులపాటు సాగిన ఆ షెడ్యూల్‌లో 'పంకజ్ కపూర్, హిమని శివ్‌పురి, రాజేష్‌కుమార్ లాంటి సీనియర్లతో కలిసి పని చేయడంవల్ల ఎంతో నేర్చుకొనే అవకాశం లభించింది. అంతా ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిపోయారు. నెల రోజులూ ఎంతో సరదాగా గడిచిపోయాయి. అదీకాకుండా 'బిన్ని' పాత్ర నిజ జీవితంలో నాకు చాలా దగ్గరగా ఉంటుంది. కొన్ని సన్నివేశాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా బామ్మ పాత్రధారి నా చిరిగినట్లుండే ఫ్యాషన్ జీన్స్ చూసి ఇదేంటని ప్రశ్నించినప్పుడు మా నాన్న గుర్తుకువచ్చారు. ఆయన కూడా ఇంట్లో నా డ్రెస్‌లు చూసి జోకులు వేసేవారు' అంటూ తన అనుభవాలు పంచుకుంది అంజినీ. డేవిడ్, వరుణ్ ధావన్ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటారు. ముఖ్యంగా ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లోనే కాకుండా, షూటింగ్ సమయంలో కూడా వరుణ్ అంజినీకి మద్దతుగా నిలిచాడు. తన ఇన్‌స్టా, ఎక్స్ ఖాతాల్లో ఆమె గురించి, ఆమె చిత్రం గురించిన విశేషాలను పంచుకున్నాడు. సినిమా విడుదల తరువాత కూడా అంజినీని ప్రత్యేకంగా అభినందించాడు.

నిరూపించుకొంటేనే...

"నా సినిమా విడుదలకు ముందు కొందరు 'బాలీవుడ్‌లో బంధుప్రీతికి మరో నిదర్శనం' అంటూ కించపరిచేలా నాపై వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో పరిచయాలవల్ల కష్టపడకుండానే మొదట్లో ఒకటి రెండు అవకాశాలు వస్తాయేమో! కానీ మనలో సామర్థ్యం లేకపోతే ఇక్కడే కాదు, ఏ రంగంలోనూ నిలదొక్కుకోలేము. మనల్ని మనం నిరూపించుకొంటేనే మనుగడ. నటిగా తెరమీద కనిపించడానికి ముందు సినీ నిర్మాణంలో ప్రతి క్రాఫ్ట్ గురించీ తెలుసుకోవాలని అనుకున్నాను. అందుకే తొలుత బాబాయి సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. షూటింగ్ స్పాట్‌కు ఉదయాన్నే వెళ్లిపోయేదాన్ని. కెమెరా, లైటింగ్, లోకేషన్లు... ఇలా అన్నిటి మీద ఒక అవగాహన వచ్చాకనే నటన గురించి ఆలోచించాను" అంటుంది అంజినీ.

మంచి స్నేహితులు...

'కూలీ నంబర్-1' షూటింగ్‌లో వరుణ్, ఆ చిత్ర కథానాయిక సారా అలీఖాన్‌తో ఎంతో సరదాగా గడిచిపోయేదని, తారలపై వచ్చే గాసిప్స్ మీద మాట్లాడుకొని నవ్వుకొనేవారమని చెప్పింది ఇరవై నాలుగేళ్ల అంజినీ. 'వరుణ్‌ను ఎప్పుడూ బాబాయిగా చూడలేదు. అన్నయ్యలాగా భావిస్తాను. తను నన్ను ఎంతో గారాబంగా చూసుకొంటాడు' అంటున్న అంజినీకి సంజయ్ కపూర్ కుమార్తె, నటి షనయ కపూర్, బోనీ- శ్రీదేవిల చిన్న కూతురు ఖుషీ కపూర్ మంచి మిత్రులు. 'నా సినిమా ప్రివ్యూ నుంచి బయటకు వచ్చేటప్పుడు వాళ్ల కళ్లు చెమర్చాయి. నా నటన బాగుందని అభినందించారు' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది అంజినీ.

అన్నీ చెయ్యాలి...

మొదటి చిత్రంతోనే మంచి నటిగా ప్రశంసలు అందుకున్న అంజినీ... భవిష్యత్తులో అన్ని రకాల పాత్రలూ చేయాలని అనుకొంటోంది. 'యాక్షన్, కామెడీ, ప్రేమ కథలు, సైకో థ్రిల్లర్లు అనే తేడా లేకుండా ప్రతి పాత్రా పోషించాలి. విలక్షణ నటిగా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి'... అని కోరుకొంటున్న అంజినీ ఏ పాత్రకైనా రెడీ అంటోంది. ఆమెకు ఇన్‌స్టాలో ఫాలోవర్స్ కూడా తక్కువేంలేరు. ఫ్యాషన్ ఐకాన్‌గా తెరంగేట్రానికి ముందే లక్షలమంది అభిమానులను సంపాదించుకున్న ఆమె... తరచూ వెరైటీ డ్రెస్సుల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తుంటుంది. వాటికి లైక్‌లూ లక్షల్లోనే. ఫిట్‌గా ఉండటానికి యోగా, జిమ్నాస్టిక్స్‌ను తన దినచర్యల్లో భాగంగా చేసుకుంది.

నవ్య | చిత్రజ్యోతి

ఆ స్వేచ్ఛ మాకూ ఉంది

\- విష్వక్‌సేన్

'ఒక సినిమా బాగోగుల గురించి విమర్శకులు, సమీక్షకులు ఎంతటి విశ్లేషణ అయినా చేయవచ్చు కానీ ఆ వంకతో వ్యక్తిత్వ హననానికి పాల్పడేలా ఉండకూడదు. మీలాగా మాకూ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందని గుర్తుంచుకోవాలి' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. రామ్ తాళ్లూరి నిర్మాత. ఈ నెల 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. విష్వక్‌సేన్ మాట్లాడుతూ "మెకానిక్ రాకీతో మా నిర్మాత రామ్ గర్వపడేలా చేస్తా. పది సినిమాల అనుభవంతో చెబుతున్నా మంచి సినిమా తీశాం. ఐదు నిమిషాలు కూడా బోర్ కొట్టదు. మా సినిమాను ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'విష్వక్‌సేన్ కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలున్నాయి. మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. యువతను, మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో తెరకెక్కిన చిత్రమిదని మీనాక్షి చౌదరి తెలిపారు. సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రమిదని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.



కొత్తగా...

రిమాండ్‌కు కస్తూరి



తమిళ నాడులో నివసిస్తున్న తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో నటి కస్తూరికి ఎగ్మోర్ మెట్రోపాలిటన్ కోర్టు 12 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. 'అధికార దుర్వినియోగాన్ని ముగింపు పలికి న్యాయాన్ని గెలిపించాల'ని కోర్టు వెలుపల కస్తూరి మీడియాతో అన్నారు. మధురై కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో హైదరాబాద్‌లో తలదాచుకున్న కస్తూరిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకొని తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే.



పట్నాలో పుష్ప రూల్

'నేను మొదటిసారి బిహార్‌కు వచ్చాను. నా హిందీ అంత బావుండదు. తప్పులు మాట్లాడితే క్షమించండి. ఎవరికీ తలవంచని పుష్ప నేడు మీ ముందు తలవంచుతున్నాడు. మీ అభిమానమే 'పుష్ప 2: ది రూల్' లాంటి మంచి చిత్రాన్ని తీయడానికి మాకు ప్రేరణ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప 2'. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని బిహార్ రాజధాని పట్నాలో భారీ జనసందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ "పుష్ప' చిత్రాన్ని పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఆ సినిమా సూపర్‌హిట్ అయ్యిందంటే ఆ గొప్పదనం నాది కాదు, ప్రేక్షకులదే. మీ ప్రేమే 'పుష్ప 2: ది రూల్' చిత్రాన్ని ఇంత గొప్పగా తీయడానికి కారణమైంది. డిసెంబర్ 5న మీ ముందుకు రాబోతోంది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'ఇంతమంది అభిమానులు 'పుష్ప' ప్రపంచంలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది. రెండు సంవత్సరాలుగా అభిమానులు ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. మీ అందరి అంచనాలకు మించి సినిమా ఉండబోతోంది' అని తెలిపారు. 'పట్నా ప్రజల నుంచి ఈ స్థాయి ఆదరణను ఊహించలేదు. ఈ గొప్పదనం అల్లు అర్జున్, సుకుమార్‌కు దక్కుతుంది' అని నిర్మాత యలమంచిలి రవి, నవీన్ యెర్నేని తెలిపారు. 'పుష్ప 2' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం భారీ ఎన్నికల ప్రచార సభను తలపించింది. దేశవ్యాప్తంగా ఉన్న అల్లు అర్జున్ అభిమానులు తరలివచ్చారు. గాంధీ మైదానం జనాలతో కిటకిటలాడిపోయింది. ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షలమంది హాజరయ్యారని అంచనా. "పుష్ప అంటే ఫైర్ కాదు వైల్డ్ ఫైర్' అంటూ ఆయన చెప్పిన డైలాగ్‌లకు అభిమానుల కేరింతలతో సభాప్రాంగణం మార్మోగింది. బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ సేన సాహెబ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశుపాలకుడిగా ప్రణవ్



వెండితెరపైన సాదా సీదా పాత్రలను అద్భుతంగా పోషించే తారలు నిజ జీవితంలో అలా జీవించగలరా? అంటే 'కష్టమే' అని చెప్పాలి. కానీ మలయాళ మెగా స్టార్ మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ మాత్రం స్టార్‌డమ్‌ను పక్కన పెట్టి దేశం కాని దేశంలో అనామకంగా జీవిస్తున్నాడు. ప్రస్తుతం స్పెయిన్‌లో 'వర్క్ అవే' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన ఓ పొలంలో కష్టపడి పనిచేస్తున్నారు. పశుపాలకుడిగా గొర్రెలు, మేకలు, గుర్రాలను కాస్తున్నారు ప్రణవ్. నటుడిగా పోషించాల్సిన విభిన్న పాత్రల్ని తన కొడుకు నిజజీవితంలో పోషిస్తున్నారని ప్రణవ్ తల్లి సుచిత్ర ఓ ఇంటర్వ్యూలో చెప్పడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఒక సూపర్‌స్టార్‌కి కొడుకు, ఆగర్భ శ్రీమంతుడు అయినా విలాసవంతమైన జీవన శైలిని వదిలి ఇలా సాదాసీదాగా గడుపుతున్న ప్రణవ్‌ను నెటిజన్లు అభినందిస్తున్నారు. 2002లో 'ఒన్నమన్' అనే సినిమాతో బాలనటుడిగా అరంగేట్రం చేసిన ప్రణవ్.. 'పునర్జనీ' చిత్రంతో ఉత్తమ బాలనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డు అందుకున్నారు. 2018లో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో 'ఆది' అనే చిత్రంతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమా ఆ ఏడాది అత్యధిక వసూళ్లు అందుకున్న చిత్రంగా నిలవడమే కాకుండా ప్రణవ్‌కు ఉత్తమ నటుడిగా సైమా అవార్డునూ తెచ్చిపెట్టింది. ప్రణవ్ కేవలం నటుడిగానే కాకుండా ప్లేబ్యాక్ సింగర్‌గా, పాటల రచయితగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు.

గాయకుడు అనురాగ్ కులకర్ణి, గాయని రమ్య బెహర వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుకకి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో వైరలవుతున్నాయి. కొద్దిమంది కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





సంగీత దర్శకుడు ఎమ్.ఎమ్.కీరవాణి చిన్న కుమారుడు శ్రీ సింహా, సీనియర్ నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం త్వరలోనే జరగనుంది. ఆదివారం గోల్కొండ రిసార్ట్స్‌లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ వేడుకలో ఆంధ్రజ్యోతి గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.



రూ. పదికోట్ల వీడియో ఫ్రీగా చూడండి



నటి నయనతార బయోపిక్‌గా నెట్‌ఫ్లిక్స్ తెరకెక్కించిన డాక్యుమెంటరీ 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్'. దీనికోసం 'నానుమ్ రౌడీ దాన్' సినిమా సమయంలో షూట్ చేసిన మూడు సెకన్ల క్లిప్‌ను వాడుకున్నందుకు రూ.పది కోట్లు ఇవ్వాలని నటుడు, నిర్మాత ధనుష్ కోరారని.. ఇందుకు ఆయనని విమర్శిస్తూ నయనతార ఓ బహిరంగ లేఖ రాసిన సంగతి తెలిసిందే. అయితే నయనతారను సపోర్ట్ చేస్తూ ఆదివారం ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండు పోస్టులు పెట్టారు. అందులో ఒక దాంట్లో.."కేవలం మూడు సెకన్లకు ధనుశ్ రూ.పది కోట్లు డిమాండ్ చేసిన వీడియో ఇదే. మీరంతా ఫ్రీగా చూసేయ్యండి" అని ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. అంతటితో ఆగకుండా... మరో పోస్ట్‌లో.. 2017లో 'సక్క పోడు పోడు రాజా' సినిమా ఆడియో ఫంక్షన్‌లో ధనుశ్ మాట్లాడిన వీడియోను కూడా షేర్ చేశారు. అందులో ప్రేమను పంచడం గురించి.. నటీనటులు పనిచేసే చోట ఉండాల్సిన వాతావరణం గురించి ధనుశ్ మాట్లాడారు. ఆ వీడియోకి కౌంటర్‌గా "జీవించండి.. ఇతరులని స్వేచ్ఛగా జీవించనివ్వండి. ప్రేమను పంచండి.. ఓం నమః శివాయ. మీరు చెప్పినవి ముందు మీరు పాటించండి. కనీసం మీ అభిమానుల కోసమైనా" అని పేర్కొన్నారు. అయితే ఈ పోస్టులను కొద్దిసేపటికే విఘ్నేష్ శివన్ తొలగించడం గమనార్హం. మరోవైపు గాయని సుచిత్ర, ధనుశ్ ఎంతో మంది హీరోయిన్లను వేధించారని ఆరోపించారు.

కార్మికులు సంఘటితంగా పోరాడాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్మన్నాయుడు



ర్యాలీ నిర్వహిస్తున్న కళాసీలు, హమాలీలు

అరసవల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హమాలీ, ముఠా, జట్టు కళాసీ కార్మికులు సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలో జట్టు కళాసీ ఫెడరేషన్ ఐదోజిల్లా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి మీదుగా పాత బస్టాండు వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారులు శ్రీనివాసులు, రామచంద్రరావు ఆటపాటలతో అలరించారు. సీఐటీయూజిల్లా ఉపాధ్యక్షుడు, కళాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సూరయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, గరిమెళ్ల విజ్ఞానకేంద్రం అధ్యక్షుడు వీజీకే మూర్తి మాట్లాడుతూ జట్టు కళాసీ, హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కోకన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఎస్.బలరాం, డి.మహాలక్ష్మి, డి.సూరి, అప్పలరాజు పాల్గొన్నారు.

జట్టు కళాసీ ఫెడరేషన్ కార్యవర్గం ఎన్నిక

జట్టుకళాసీ ఫెడరేషన్‌కార్యవర్గాన్ని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కె.సూరయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.చిన్నారావు, ప్రకాశరావు, ఉపాధ్యక్షులుగా డి.మహాలక్ష్మి, వల్లభరావు, సహాయ కార్యదర్శులుగా కె.లక్ష్మీనారాయణ,డి.సింహాచలం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.సూరి,కోశాధికారిగా పి.అప్పలరాజు, కమిటీసభ్యులుగా వి.సింహాచలం, ఎల్.ఫకీరు, ఇ.అప్పారావు, బి.అప్పారావు, ఎ.సతీష్, కె.అప్పన్న,నర్సయ్య, సుబ్బయ్య, మీనారావు, బి.రామారావు, పోలారావు, రమణ, బి.సహదేవ్, రమేష్, చంద్రయ్య, జోగారావు, తేజేశ్వరరావు, బాబూరావు ఎన్నికయ్యారు.

పంచారామాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

అరసవల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచారామాలకు వెళ్లే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో శ్రీకాకుళం డిపో-1, 2 మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంత్ర నాలుగు గంటలకు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరతాయని తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో గల శివాలయాల దర్శించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 24న కూడా పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. వివరాలకు 9959225608, 2259225609, 2259225610, 9959225611 నెంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, టెక్కలి అసిస్టెంట్ మేనేజర్ పీఎస్ఎన్ మూర్తి, శ్రీను, ప్రసాద్, ఎంపీరావు పాల్గొన్నారు.

గేమ్స్ చాంపియన్ షిప్‌గా ఎచ్చెర్ల

● ముగిసిన జోన్ -1 గురుకుల బాలికల క్రీడాపోటీలు



ట్రోఫీ అందుకుంటున్న ఎచ్చెర్ల గురుకుల పాఠశాల కబడ్డీ జట్టు

ఎచ్చెర్ల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జోన్1- గురుకుల పాఠశాలల విద్యార్థినుల క్రీడలపోటీలు ఆదివారం ముగిశాయి. ఉమ్మడి మూడు జిల్లాల్లోని 21 గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన 800 మంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్స్‌తోపాటు 100 మీటర్లు, 200,400, 1500 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్ జావెలిన్, డిస్కస్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈసందర్భంగా సీనియర్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో గరుగుబెల్లి, సీనియర్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ ఎ.లక్ష్మి (గరుగుబెల్లి), సీనియర్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ గరుగుబెల్లి, గేమ్స్ చాంపియన్‌షిప్ ఎచ్చెర్ల దక్కించుకున్నాయి. జూనియర్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ వియ్యంపేట, గేమ్స్‌చాంపియన్‌షిప్ పెద్దపాడు సాధించాయి. జూనియర్స్‌లో ఓవరాల్‌చాంపియన్ షిప్‌ను గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో వియ్యంపేట, వ్యక్తిగత చాంపియన్‌షిప్ ఎ.జీవనప్రియ (భామిని) దక్కించుకున్నారు. ఈమేరకు ఎచ్చెర్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ అధ్యక్షతన ముగింపు సమావేశంలో శ్రీకాకుళం, విశాఖ జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయకర్తలు ఎస్.బాలాజీ నాయక్, ఎస్.రూపవతి, విశ్రాంత డీసీవో బి.చంద్రావతి, వివిధగురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్ డి.దేవేంద్రరావు, టి.జయశ్రీ పాల్గొన్నారు. విజేతలకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఖోఖో విజేత బాలికోన్నత పాఠశాల

ఇచ్ఛాపురం,నవంబరు 17(ఆంధ్రజ్యోతి):స్థానిక సురంగిరాజా మైదానంలో న్యూజనరేషన్‌మంత్ కార్యక్రమంలో భాగంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బాలికల ఖోఖో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈసందర్భంగా ఫైనల్‌లో ఫైనల్‌లో ఇచ్ఛాపురం బాలికోన్నత పాఠశాల విజేతగా నిలవగా, డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచింది. కార్యక్రమంలో రోటరీ సభ్యులు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విప్‌గా అశోక్ నియామకంపై హర్షం

సోంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) :ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను విప్‌గా నియమించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఆదివారం కొర్లాంలో టీడీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేదు.. నాణ్యత కరువు

● నాసిరకం పనులతో పొంచిఉన్న ప్రమాదం
● ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు
● ఇదీ పాత హిరమండలం జగనన్నకాలనీలో పరిస్థితి



విద్యుత్ స్తంభం అడుగు భాగంలో కోరుకుపోయిన మట్టి

హిరమండలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలోని పాత హిరమండలం సమీపంలో గల జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత కొరవడింది. నాసిరకం పనుల వల్ల ప్రమాదం పొంచి ఉంది. స్తంభాల కింది భాగంగా కాంక్రీట్ వేయకపోవడంతో గాలులకు కూలిపోయే ప్రమాదముందున్న ఆందోళన నెలకొంది.

హిరమండలంలోని పాత హిరమండలం సమీపంలో వంశధార నది పక్కన ఉన్న లోతట్టు ప్రాంతంలో జగనన్నకాలనీ పేరుతో 196 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ప్రస్తుతం 25 మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. కాలనీలో సీసీరోడ్లు, కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా విద్యుత్ సౌకర్యం మాత్రం కల్పించారు. పదినెలల కిందట స్తంభాలువేసి లైన్లు సైతంఇచ్చారు.ఈపనులకు సంబంధించి కాంట్రాక్టు వంశధార నిర్వాసితులకు చెందిన ఓ వ్యక్తికి అప్పగించారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా స్తంభాలు ఏర్పాటుచేశారన్న ఆరోపణలొస్తున్నాయి. కాలనీలో ఎనిమిది మీటరు, 9.1 మీటరు స్తంభాలు 40కిపైగా ఏర్పాటుచేశారు.గాలి, వరదలకు తట్టుకోవడానికి వీటిని పాతే సమయంలో భూమి అడుగు



లోతట్టు ప్రాంతంలో గల మెత్తని స్థలంలో స్తంభాలు ఏర్పాటుచేసిన దృశ్యం

భాగంతోపాటు స్తంభం చుట్టూ కాంక్రీట్ వేయాల్సి ఉంది. అయితే ఇక్కడ జగనన్నకాలనీలో ఏర్పాటు చేసిన స్తంభాలకు ఇక్కడ పాతే సమయంలో భూమిలో సిమ్మెంటు కాంక్రీట్ వేయకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.మెత్తని మట్టి గల ప్రదేశంలో స్తంభాలు పాతడంతో చాలా వాటికి అడుగు భాగంలో మట్టి కోరుకుపోయి ప్రమాదకరంగా మారాయి. స్తంభాలు కిందభాగంలో వర్షంనీటికి మట్టి కొట్టుకుపోయి పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. వంశధార నది పక్కన కాలనీ ఉండడంతో వరదలు వచ్చే సమయంలో ముంపునకు గురయ్యే అవకాశముందని లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఆ సమయంలో స్తంభాలు వరద నీటికి కూలిపోయే పరిస్థితి నెలకొంది. పెనుగాలులు వీచే సమయంలో స్తంభాలు కూలిపోయోమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కాగా పాత హిరమండలం సమీపంలో గల జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుపనులు ఓ కాంట్రాక్టర్ నిర్వహించాడని హిరమండలం ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు.ఆ పనులు ఇతర డిపార్ట్‌మెంట్ అధికారులు పర్యవేక్షించారని చెప్పారు. తాను కాలనీలో స్తంభాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శివసాగర్ తీరంలో సమస్యల పాగా

● పర్యాటకులకు తప్పని అవస్థలు ● పార్కింగ్‌కు వేధిస్తున్న స్థల సమస్య



శివసాగర్ తీరంలో పర్యాటకుల తాకిడి

వజ్రపుకొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):శివసాగర్ తీరంలో సమస్యలు తిష్ఠవేశాయి. ఏటా కార్తీక మాసంలో వేలాది మంది పర్యాటకులకు ఇక్కడకు పిక్నిక్‌లకు వస్తుంటారు. ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందిపడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారితో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి నిత్యం పర్యాటకులు వచ్చి సేదతీరుతున్నారు. విశాంతి తీసుకునేందుకు గదులు, మరుగుదొడ్లు లేకపోవడంతోపాటు మహిళా పర్యాటకులు స్నానాలు చేస్తే కనీసం తడిబట్టలు మార్చుకోనేందుకు వసతులు కల్పించ లేదు. ఇక్కడకు వేలాది మంది పర్యాటకులు వస్తున్నా తీరం అభివృద్ధి చేయడంలో నాయకులు శీతకన్నువేశార న్న పలువురు ఆరోపిస్తున్నారు. కనీసం రోడ్డుకు ఇరువైపుల పెరుగుతున్న పిచ్చి మొక్కలు సైతం తొలగించకపోవ డంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. దీంతోపాటు వాహనాల పార్కింగ్ సమస్య కూడా స్థల సమస్య వేధిస్తోంది. తక్షణమే శివసాగర్ తీరం అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే..

● మలుపు వద్ద రక్షణ గోడ లేని వైనం ● ఇదీ లొత్తూరు- కాంట్రగడ మార్గంలో పరిస్థితి



లొత్తూరు-కాంట్రగడ రహదారిలో ప్రమాదరకరంగా ఉన్న మలుపు

పలాసరూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లొత్తూరు నుంచి కాంట్రగడ గ్రామానికి వచ్చే మార్గంలో సాగు నీటి కాలువ వద్ద రోడ్డు మలుపులోఆదమరిస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కాంట్రగడ పొలాలకు నీరుచేరే కాలువ రోడ్డుకు ఆనుకొని ఉండడం, రోడ్డుపై సరైన రక్షణ గోడ లేకపోవడంతో చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు భయాందోళన చెందుతున్నారు. కాంట్రగడ నుంచి లొత్తూరుకు తక్కువ దూరం కావడంతో ఈ రోడ్డు గుండా అధిక సంఖ్యలో వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల ఓ ద్విచక్రవాహనచోదకుడు కాలువ లోకి దూసుకుపోయిన విషయం విదితమే. ప్రస్తుతం వరి పంటకోతల సీజన్ కావడం, అధిక సంఖ్యలో నాటుబండ్లు, ట్రాక్టర్లు ఈ రహదారిలో తమ పంటలను ఇళ్లకు చేరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా మలుపు వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, గ్రామస్థులు కోరుతున్నారు.

శానిటరీ మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

● ఐదో రోజుకు చేరిన మునిసిపల్ కార్మికుల సమ్మె



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

గుజరాతీపేట, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): శానిటరీ మేస్త్రీలను విధుల్లోకి తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని మునిసిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణి, అప్పలరాజు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్ హెచ్చరించారు. ఆదివారం మునిసిపల్ కార్యాలయం వద్ద శానిటరీ మేస్త్రీలు, పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ ఐదు రోజులుగా సమ్మెచేపడుతున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ఎం.రామారావు, ఎ.రవి. మునిసిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, తార, డి.రమణ పాల్గొన్నారు.

పక్కా సమాచారాన్ని సేకరించండి: పీడీ



మాట్లాడుతున్న మెప్మా పీడీ రమణ

గుజరాతీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్.హెచ్‌ఫైలింగ్ యాప్ ద్వారా పట్టణ సంఘ మహిళల సమాచారాన్ని పక్కాగా సేకరించాలని మెప్మా పీడీ ఎస్‌వీ రమణ ఆదేశించారు. ఆదివా రం పట్టణంలోని జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు.ఈసందర్భంగామాట్లాడుతూ మెప్మా ద్వారా పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు మెరుగైన జీవనోపాదుల కల్పనకు ప్రభుత్వచర్యల్లో భాగంగా ఆర్పీల ద్వారా సమాచారసేకరణ చేపడుతున్నట్లు తెలిపారు.ప్రతి మహిళాపారిశ్రామికవేత్తగా రాణించాలన్నారు. మహిళా సంఘాలు తయారుచేసే ఉత్పత్తులను ప్ర త్యేక యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అమ్మకాలు ప్రోత్సహి స్తూ వాణిజ్య విస్తరణతో అధిక ఆదాయాన్ని సముపార్జించేలా మెప్మాఎండీ తేజ్‌భరత్ చర్యలు తీసుకుంటారన్నారు.కార్యక్రమంలో సీఎంఎంఎస్ వెంకటరావు, సీవోలు ఎం.అమ్మినాయుడు, పి.సీతారాజు, బి.సాయి సత్యనారాయణ, ఆర్పీలు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి కేటాయించాలి

అరసవల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శిష్టకరణ కార్పొరేషన్ చైర్మన్ పదవిని జిల్లాకు కేటాయించాలని జిల్లా తెలుగుదేశం శిష్టకరణ సాధికార సమితి కోరింది. ఆదివారం సమితి సమావేశం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల టీడీపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సదాశివుని రాంబాబు, జిల్లా కన్వీనర్ సదాశివుని వేంకటేశ్వరరావు, పట్నాయకుని మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పదవిని జిల్లాకు కేటాయించాలని సమితి తీర్మానించింది. కార్పొరేషన్ అధ్యక్షునిగా సదాశివ రాంబాబు, లేదా పట్నాయకుని మధుసూదనరావును నియమించాలని కోరింది. సమావేశంలో జిల్లా సాధికార సమితి సభ్యులు బెహరా రామచంద్రరావు, బీవీఎస్ఎన్ మూర్తి, నందిగామ కోటేశ్వరరావు, డబ్బీరు వెంకటరావు, నౌపడ హరి ప్రభాకర్, బలివాడ కృష్ణారావు, రఘుపాత్రుని శ్రీనివాసరావు, కుప్పిలి వెంకటరమణారావులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఐక్యత చాటాలి

ఆమదాలవలస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల ఐక్యత చాటాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. పట్టణంలో వేద గాయత్రి బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి రవి ప్రకాష్ పాల్గొన్నారు.

కంచిలి ఎస్ఐగా పారినాయుడు

కంచిలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కంచిలి ఎస్ఐగా పారినాయుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై కంచిలి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

రణస్థలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటిఈశ్వరరావు ఆదివారం విజయవాడ కనకదర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామూర్తినాయుడుకు నివాళి

రణస్థలం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామూర్తినాయుడు చిత్రపటానికి ఆదివారం ఎమ్మెల్యే ఎన్ఈఆర్ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోనడుకుదిటి తేజాబాబు,శ్యామలరావు, పిన్నింటి బానూజీనాయుడు, పిషిని జగన్నాధంనాయుడు, వంశీ పాల్గొన్నారు.

● అరసవల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని విశాఖ-ఏ కాలనీలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో రామ్మూర్తినాయుడి చిత్రపటానికి తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గొండు స్వాతి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రీమియం గడువు పొడిగింపు

గుజరాతీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 804 మంది రైతులు జీడి, మామిడి పంటకు సుమారు 138 లక్షల వరకు పంటల బీమా పథకం కింద ప్రీమియం చెల్లించినట్లు జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.ఇందుకు సంబంధించిన కొందరు రైతులు చెల్లించేందుకు ఈనెల 22 వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయశాఖకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, జీడి పంటకు బీమా సౌకర్యం పొందాలని కోరారు.

లావేరులో సామూహిక మహా రుద్రాభిషేకం



లావేరు భవానీ చంద్రశేఖరస్వామి ఆలయంలో మహారుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

లావేరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : లావేరు భవానీ చంద్రశేఖర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సామూహిక మహారుద్రాభిషేకం జరిగింది. అర్చకులు నేతేటి బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో పలువురు రుత్వీకులు పూజలు చేపట్టారు. అనంతరం శివ పార్వతిల కళ్యాణం నిర్వహించారు.

శ్రీకూర్మంక్షేత్రానికి పోటెత్తిన భక్తులు

గార, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. ఇక్కడ ఈవో గురునాధరావు పర్యవేక్షణ ఏర్పాట్లు చేశారు.

క్రైం కార్నర్

జమ్ము జగనన్న కాలనీలో చోరీ

నరసన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్ము పంచాయతీలో మందలమ్మ గుడి ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలోని ఇంటిలో పట్ట పగలే చోరీ జరిగింది. ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాలిలా.. కాలనీలో ఉంటున్న ముంగి శాంతారావు ఇంటిలో సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి తాళాలు పగలు కొట్టి బీరువాలోని రూ.1.90 లక్షలను నగదు దొంగిలించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనా ప్రాంతాన్ని సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నరసన్నపేట ఏఎస్ఐగా సింహాచలం బాధ్యతలు చేపట్టినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం మార్గంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం తొలుసూరుపల్లికి చెందిన శిష్టి ప్రసాదరావుకు గాయాల య్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇంటికి వచ్చిన కుమార్తె మౌనికను ఆమె అత్తవారి గ్రామమైన రహమాన్‌పురానికి ద్విచక్ర వాహనంపై తీసుకువెళుతుండగా హరిశ్చంద్రపురం రోడ్డులో హైవే సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడ ప్రసాదరావును తొలుత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్య నారాయణ తెలిపారు.

ఉపాధ్యాయురాలి ఆత్మహత్యపై తహసీల్దార్ విచారణ

పలాస, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈదురాపల్లి గ్రామంలో అత్తవారింట ఆత్మహత్య కు పాల్పడిన ఉపాధ్యా యురాలు శాసనపురి నవ్య కేసుపై ఆదివారం పలాస ప్రభుత్వ ఆసు పత్రి ఆవరణలో తహసీ ల్దార్ టి.కల్యాణ చక్రవర్తి విచారణ చేపట్టారు. మిలటరీ ఉద్యోగి షణ్ము ఖరావుతో ఆమె ప్రేమ వివాహం చేసుకొని నాలుగేళ్లవడంతో నిబంధనల ప్రకారం మెజిస్ట్రేట్ హోదాలో తహసీల్దార్ విచారణ చేపట్టారు. ఆ మేరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అత్తమామలు, ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్థులు, భర్త నుంచి వివరాలు సేకరించారు. విచారణ మొత్తం వీడియో రికార్డ్ చేశారు. ఆత్మహత్యపై ఎవరికైనా అనుమానాలుంటే తెలియజేయాలని తహసీల్దార్ కోరారు. శవ పంచనామా అనంతరం మృత దేహాన్ని కుటుంబసభ్యు లకు అప్పగించారు. ఘటనా స్థలానికి ఉపాధ్యాయసంఘ నాయకులు చేరుకొని నివాళులు అర్పించారు. మంచి ఉపాధ్యాయురాలిని కోల్పోయామని వారు విచారం వ్యక్తంచేశారు. సీఐ డి.మోహనరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధం

శ్రీకాకుళం క్రైమ్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పరిధిలోగల అరసవల్లి కాపువీధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మందుగుండు సామగ్రి ప్రమాదవశాత్తు పూరిళ్లపై పడడంతో కంబూరు నారాయణస్వామి, అవురు రాజాలింగం, రౌతు రాజాలింగం కు సంబంధించిన ఇళ్లు దగ్ధమయ్యాయి. దీంతో రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. ఈ ప్రమాదంలో ఓ ఇంట్లో బాలికకు సంబంధించిన హాల్‌టికెట్ దగ్ధమైంది. ఈనెల 18న పరీక్షకు హాజరుకావల్సి ఉంది. పుస్తకాలు పూర్తిగా బూడిదయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు ఏడీఎఫ్‌వో వర ప్రసాద్ పేర్కొన్నారు.

ధాన్యం బస్తాల చోరీ

ఎల్.ఎన్.పేట, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి): యంబరాం, బొత్తాడసింగి గ్రామాల్లో శనివారం రాత్రి ఆరుగురు రైతులకు చెందిన 53 బస్తాల ధాన్యం ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. యంబరాంలో పెనుమజ్జి ధర్మారావుకు చెందిన 17 బస్తాలు, కె.లక్ష్మీనారాయణకు చెందిన 6 బస్తాలు, వై.సింహా చలానికి చెందిన 6 బస్తాలు, డి.దాలిరాజుకు చెందిన 6 బస్తాలు, బొత్తాడసింగి గ్రామంలో పి.వరలక్ష్మికి చెందిన 10 బస్తాలు, జమ్మయ్య దొరకు చెందిన 8 బస్తాల ధాన్యం చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. ఆదివారం ఉదయం వెళ్లి చూసేసరికి తమ పొలాల్లో నెట్లు వేసి ఉన్న వద్ద ధాన్యం బస్తాలు తక్కువగా ఉండడంతో రైతులు ఫిర్యాదు చేసినట్లు సరుబుజ్జిలి పోలీసులు తెలిపారు.

కంచిలి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

కంచిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కంచిలి రైల్వేస్టేషన్‌లో ఎస్ఐ పి.పారినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల సామగ్రి పరిశీలించారు.గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగానికి అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


వంశీ కృష్ణ (ఫైల్)

ఇచ్ఛాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పట్టణంలోని బలరాంపేటకు చెందిన వంశీ బస్టాండ్ సమీపంలోని ఓ రెడీమేడి సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో బరంపురం వెళ్లా డు. అక్కడ ఉన్న బావ కృష్ణకు కలిసి సరదాగా గడిపారు. అనంతరం ఇద్దరూ కలిసి బరంపురం నుంచి ఇచ్ఛాపురం ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఇచ్ఛాపురం నుంచి బరంపురం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో 108లో ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బావ మరిది వంశీ (24) మృతి చెందాడు. బావకృష్ణకు తీవ్ర గాయాలు కావడం బరంపురం తరలించారు. ఈ మేరకు టౌన్ఎస్ఐ చిన్నంనాయుడు కేసు నమోదు చేశారు.

104 ఉద్యోగులకు భద్రత కల్పించాలి

కొత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ధర్మాన కిరణ్ కోరారు. మండలంలోని సర్పంచ్‌లకు 104 ఉద్యోగులు వినతిపత్రాలు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలనెలా వేతనాలు సక్రమంగా చెల్లించాలన్నారు. యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాలపోలమ్మ అమ్మవారి గుడికి స్థలం వితరణ

వజ్రపుకొత్తూరు, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): పూండి గోవిందపురం గ్రామానికి చెందిన పలువురు రూ.15 లక్షల విలువ చేసే స్థలాన్ని శ్రీపాల పోలమ్మవారి గుడికి విత రణగా అందజేశారు. అమ్మవారి గుడిలో కార్యక్రమాల నిర్వహణకు స్థలం సరిపోకపో వడంతో గుడి చుట్టూ ఉన్న స్థలం యజమానులు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, సైని చినబాబు, శ్రీను, సైని ముఖలింగం, భాస్కరరావు, రమేష్, తిరుపతిరావు ఆదివారం సమావేశమై 3750 అడుగుల స్థలం దానంగా ఇచ్చేందుకు అంగీకరించి సదరు స్థలాన్ని చదును చేసి గుడి నిర్వాహకులకు అందించారు.

ఎనిమిది మద్యం కేసులు నమోదు

ఇచ్ఛాపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వారంరోజుల్లో ఎనిమిది మద్యం కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి చేపట్టిన దాడుల్లో ఒడిశాకు చెందిన 11బీరు సీసాలతో పాటు ఆంధ్రాలో కొనుగోలు చేసి మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న 77 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.ఈ మేరకు సంబంధిత వ్యక్తులను అరెస్ట్ చేసి ఇచ్ఛాపురం, కవిటి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌ల ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

సుసరాం మార్గంలో పిచ్చిమొక్కల తొలగింపు

పోలాకి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గంగివలస పంచాయతీ మొగిలిల్లిపేట నుంచి సుసరాం వరకు ఉన్న మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను ఎస్ఐ రంజిత్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం తొలగించారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు.

శ్రీముఖలింగంలో బాలియాత్ర

- దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

జలుమూరు, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగంలో కళింగ సామాజికవర్గం ఆధ్వర్యంలో ఆదివారం బాలియాత్ర, దీపోత్సవం ఘనంగా జరిగింది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న కళింగ ప్రము ఖులు, ప్రజలు ఈ కార్యక్రమంలో వేలాది మంది తరలిరావడంతో శ్రీముఖలింగం కిటకిటలాడింది. కళింగుల ప్రాచీన సంప్రదాయం బాలియాత్ర నిర్వహించి వంశధార నదిలో అరటి తెప్పలతో దీపాలు విడిచి పూర్వీకుల ఆత్మకు శాంతి కలిగించాలని వారంతా వేడుకున్నారు. అంతకు ముందు శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకొని సాయంత్రం వంశధార నదికి ర్యాలీగా వెళ్లి అరటి తెప్పల్లో దీపాలు విడిచిపెట్టి వారి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. దీపోత్సవానికి వెళ్లే వారికి గ్రామస్థులు ఆలయం వద్దనే అరటితెప్పలు, నూనె, నెయ్యితో కూడిన వత్తులు ఉచితంగా పంపిణీ చేశారు. దీపోత్సవంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సతీమణి బగ్గు సుగుణమ్మ, జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, మాజీ స్పీకర్ తమ్మి నేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మాజీ చైర్మన్ పేడాడ తిలక్, డాక్టర్ జీవితేశ్వరరావు, దానేటి శ్రీధర్, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్ తదిత రులు పాల్గొన్నారు.


వంశధార నదిలో దీపాలు విడిచి నమస్కరిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు


దీపోత్సవానికి ర్యాలీగా వెళుతున్న కళింగ సామాజికవర్గ ప్రజలు

ఘనంగా సుందరకాండ పారాయణం

- 1016 మంది మహిళలతో ఏకకాలంలో నిర్వహణ
- వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

నరసన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ విదియను పురస్కరించుకొని నరసన్నపేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం సామూహిక సుందరకాండ పారాయణం నిర్వహించారు. స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీలక్ష్మీ నరసింహ కోలాట భజనబృందం, విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో 1,016 మందితో ఏకకాలంలో విశేష సర్గ పారాయణం నిర్వహించారు. తొలుత వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచిశ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను తిరువీధిగా పంచాయతీ కార్యాలయం వరకు తీసుకువచ్చిన అనంతరం ప్ర త్యేక పూజలు చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఒడిశా నుంచి వచ్చిన మహిళలు ప్రత్యేక వస్త్రలంకరణతో సుందరాకాండ పారాయణం చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 1016 మంది మహిళలు చేపట్టిన ఈ పారాయణ అంద రినీ పరవశింపజేసింది. తొలిసారి దక్షిణ భారతంలో 1016 మంది మహిళలతో ఒకే సమయంలో సుందరకాండ పారాయణం చేపట్టారని దీన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు చేసినట్లు సంస్థ ప్రతినిధి రూప్‌నాథ్ తెలిపారు. కార్యక్రమం నిర్వహక ప్రతినిధి వారణాశి సంతోషికుమారికి వండర్ బుక్ ఆఫ్ రికార్డు ధ్రువపత్రం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు చామర్తి శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, పీసపాటి సూరిబాబు, ఉత్తరాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి, ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి సతీమణి బగ్గ సుగుణ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజన బృంద సభ్యులు పాల్గొన్నారు.




పారాయణంలో పాల్గొన్న మహిళలు, భక్తులు, అర్చకులు, రుత్వికులు

మత్స్యకారులకు చిక్కిన టూనా

(ఐదో పేజీ తరువాయి)

అంతంతమాత్రమే ఉండడంతో దళారులకు కిలో రూ.70కు విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. చేపలవేట కూడా సక్రమంగా సాగక వలస బాట తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగానే ఉపాధి మార్గాలు మెరుగు పరిచేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జీపీఎస్ సౌకర్యం లేక అవస్థలు



భావనపాడు తీరంలో సుమారు 258 వరకు బోట్లు చేపలవేటకు వెళ్తున్నా.. అందులో ఒకే ఒక్క బోటుకు జీపీఎస్ సౌకర్యం ఉంది. చేపల వేటకు సముద్రంలోకి పది కిలోమీటర్లు దాటి లోపలకు వెళ్లిన తర్వాత మేము వచ్చే ఒడ్డు ప్రాంతం గుర్తించడం కష్టమవుతోంది. మేము ఎక్కడ బయలుదేరామో తిరిగి అక్కడికి చేరాలంటే జీపీఎస్ వంటి సాంకేతిక సౌకర్యం ప్రభుత్వం కల్పించాలి.

\- బయ్యా చిన్నబాబు, మత్స్యకారుడు, భావనపాడు

ఉపాధి లేక వలసలు



తీరంలో చేపలు వేట సక్రమంగా సాగడం లేదు. ఉపాధి కోసం భావనపాడు, మజ్జిపేట, వాడపేట, కొత్తపేట గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ఈ ప్రాంతంలో హార్బర్ నిర్మిస్తే వలసలు నివారించవచ్చు. నాలుగు దశాబ్దాలుగా హార్బర్‌పై ఆశలు రేకెత్తిస్తున్నారే తప్ప అమలుకు నోచుకోవడం లేదు.

\- కారాడ భీమారావు, మత్స్యకారుడు, భావనపాడు

బేతాళపురంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

మందస,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మందస ఉద్దాన ప్రాంతమైన బేతాళపురం తీర ప్రాంతంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల సమావేశంలో తీర్మానించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ డొక్కర దానయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి తీర్మానించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సభ్యులు కోరారు. అలాగే పలు సమస్యలపై చర్చించారు. సమా వేశంలో జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, ఎంపీ డీవో పి.సూర్యనారాయణ, తహసీ ల్దార్ ఎస్.హైమా వతి, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులపై దాడి చేసి వైసీపీ మీడి యాలో తప్పుడు ప్రచారం చేస్తున్న గూడెం చిన్నారావు, ఆయన కుటుంబ సభ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని మంచినీళ్లపేట టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో మాజీ సర్పంచ్, టీడీపీ జిల్లా మత్స్యకార నాయకుడు గున్న చిన్నా రావు, మాజీ ఎంపీటీసీ సన్నా మాధవరావు, ఆకుల భాస్కరరావు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. కిందేళ్ల కిందట జట్టీ పనుల్లో కూలీ చేసిన 56 మందికి చెందిన రూ.2.40 లక్షల సొమ్ము చెల్లించాలని కాంట్రాక్టర్ సదరు చిన్నారావును గ్రామ సమావేశంలో అడుగ్గా డబ్బు లు ఇవ్వకపోగా తిరిగి ఆ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామపెద్దలతో పాటు టీడీపీ నాయకులపై దాడి చేశారని, అయితే తామె వారిపై దాడి చేసినట్లు ప్రచారం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి దాడికి బాధ్యులపై చర్యలు తీసుకుని గ్రామంలో శాంతియుత వాతావరణం కల్పించాలని కోరారు. నాయకులు బొంగు ఈశ్వరరావు, జగన్నాయులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఎచ్చెర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరిణాం అక్కివలస గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైనట్టు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎచ్చెర్లలోని ఓ కళాశాలలో చదువుతున్న ఆ యువతి ఈనెల 14న కళాశాలకు వెళ్తానని చెప్పి, తిరిగి ఇంటికి చేరలేదని ఆమె తల్లి వసంత కృష్ణవేణి ఫిర్యాదులో పేర్కొంది.

ధాన్యం.. ఎక్కడైనా విక్రయించవచ్చు

(ఐదో పేజీ తరువాయి)

కల్పించాం. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి.. మిల్లులకు పంపించాలి. మిల్లర్లు కూడా కొను గోలు చేసిన 15 రోజుల్లో ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎఫ్‌సీకి తరలించాలి. నచ్చిన మిల్లుకు తీసుకెళ్లే వెసులుబాటు కల్పించాం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. ఈ ఏడాది పంటల దిగుబడి బా గుంది. రైతులు ఒకటి, రెండు నెలలు నిల్వ చేసి.. ధాన్యం విక్రయిస్తే.. రూ.2,400 వరకు మద్దతు ధర లభించవచ్చు. దీనిపై వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల అధికారులతో సమావేశమయ్యారు. ఈ మేరకు ఆలస్యమైనా రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతున్నామ'ని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఎస్‌వో జి.సూర్యప్రకాశరావు, డీసీవో నగేష్, డీసీసీడీ సీఈవో వరప్రసాద్, జీఎం జగదీష్, పీఏసీఎస్ పీఐసీ కె.వెంకటరావు, పీఏసీ ఎస్ సీఈవో మెండ సత్యనారాయణ, టీడీపీ నేతలు బోయిన రమేష్, కర్రి అప్పారావు, నంబాళ్ల శ్రీనివాసరావు, సింహాచలం పాల్గొన్నారు.

ఎట్టకేలకు విద్యుత్ సమస్యకు పరిష్కారం

కోటబొమ్మాళి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): లఖందిడ్డి, యలమంచిలి , గంగరాం పంచాయతీలకు సంబంధించిన విద్యుత్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఇప్పటి వరకు ఈ గ్రామాలకు సంతబొమ్మాళి ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది. దీనివల్ల తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో టీడీపీ నేతలు మంత్రి అచ్చెన్నా యుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో అధికారులు కోటబొమ్మాళి మండలం నుంచి 11 కేవీ లైన్ ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారం అయిందని జలవనరుల మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు అన్నారు. ఆదివారం గుంజిలాం జక్షన్ వద్ద సంబంధిత 11 కేవీ ఆనాఫ్ స్విచ్‌ను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరి వరప్రసాద్ ప్రారంభించారు. ట్రాన్స్‌కో ఏఈ గురుబెల్లి సురేష్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, నేతలు రోణంకి లీలా మోహన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

నరసన్నపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.21 వేల కోట్లు పీఎఫ్, ఎల్ఎల్‌లు, ఏపీజీఎల్ఐసీలు బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. విద్యావ్యవస్థలో మార్పులు, ప్రయోగాలపేరుతో ప్రాథమికోన్నత పాఠశాలలను మూసివేయడం తగదన్నారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్ని క చేశారు. మండల అధ్యక్షుడిగా టి.సుధీర్, కార్యదర్శిగా కె.ఆదినారాయణలను ఎన్నుకున్నారు.

విజయవంతం చేయాలి

టెక్కలి, నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): హరిపురంలో ఈనెల 24, 25 తేదీల్లో జిల్లా స్వర్ణోత్సవ మహాసభల ను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దాలయ్య కోరారు. ఆదివారం టెక్కలిలో కరపత్రాలను ఆవిష్కరించారు. అపార్ నమస్యలపై ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదన్నారు. ఉపాధ్యాయులను కించపరిచేలా ఆర్డీవోస్థాయి అధికారి మాట్లాడడం సరికాదన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. సమా వేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు, జిల్లా కార్యదర్శి శంకరరావు, మండల ప్రధానకార్యదర్శి వైకుంఠరావు, నాయకులు ధర్మారావు, పాపారావు, అరుణ్‌కుమార్, చిన్నవాడు, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలతో ప్రమాదాలు

నందిగాం/కోటబొమ్మాళి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాలకు ఉన్న మార్గాల్లో రోడ్లకిరుపక్కలా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో తరచూ ప్ర మాదాలు జరుగుతున్నాయి. పిచ్చి మొక్కల వల్ల ఎదు రుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపిం చకపోవడంతో వాహనాలు ఢీకొట్టిన ప్రమాదాలు సంభ విస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోందని పలు గ్రామాల ప్రజలు ఆవే దన వ్యక్తంచేస్తున్నారు. నందిగాం, కోటబొమ్మాళి మండలాల్లో పలు గ్రామాల్లో ఇటువంటి పరిస్థితి ఉంది. నందిగాం మండలం నరేంద్రపురం జంక్షన్ నుంచి వల్లభరాయుడుపాడు, దొడ్లరామచంద్రాపురం వయా దేవాడ మార్గంలో రోడ్లకు ఇరుపక్కలా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అలాగే కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ముళ్లపొదలు దట్టంగా పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నరేంద్రపురం జంక్షన్ నుంచి వల్లభరాయుడుపాడు, హరిశ్చంద్రపురం నుంచి హైవేకి వెళ్లే దారిలో

న్యూస్ బాక్స్

తారు రోడ్డు నిర్మాణంపై హర్షం

వజ్రపుకొత్తూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): డోకులపాడు గ్రామం నుంచి సముద్ర తీరంలో ఉన్న గంగాధర పల్లికి కాలనీకి తారురోడ్డు పనులు పూర్తికావడంపై జనసేన నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఆదివారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు లండ గిరిబాబు, యుగంధర్, బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా తారు రోడ్డు లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. రోడ్డు నిర్మాణానికి పాటు పడిన ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎయిమ్స్‌లో ఫలితాల్లో అనిరుధ్‌కు 272వ ర్యాంక్


272వ ర్యాంక్ సాధించిన అనిరుథ్‌బాబు

మెళియాపుట్టి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొసమాలకు చెందిన అంకడల అనిరుథ్ బాబు ఆల్ ఇండియా ఎయిమ్స్ ఫలితాల్లో 272వ ర్యాంక్ సాధించినట్లు తండ్రి తేజేశ్వరరావు తెలిపారు. గతంలో ఎంబీబీఎస్ ఎంట్రన్స్ ఫలితాల్లో 7వ ర్యాంక్ సాధించి జిమ్స్ కాలేజీలో ఎంబీబీఎస్ చేస్తున్నాడు. అనిరుథ్ ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు పాతపట్నం, 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు విశాఖలోని ఓ ప్రైవేటు కాలేజీ లో చదివాడు, ఆలిండియాలో 272వ ర్యాంక్ సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, స్నేహితులు అభినందించారు.

పెన్షన్, జీతాలు జమకాకపోవడంతో అవస్థలు

నందిగాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థలో పనిచేసిన సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులకు ఇప్పటికీ జీతాలు, పెన్షన్లు జమకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తమిరె వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యను ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకువెళ్తే సాంకేతిక సమస్య కారణంగా జమకాలేదని చెప్పారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని ఉద్యోగులను ఆదు కోవాలని ఆయన కోరారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేదెలా?

- రాళ్లుతేలడంతో ఇబ్బందులు
- ఇవీ ఎల్ఎన్‌పేట, వజ్రపుకొత్తూరు మండలాల్లో తీరు

ఎల్.ఎన్.పేట/వజ్రపుకొత్తూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రాలను చూస్తున్నారుగా.. ఎలా ఉన్నాయో.. రాళ్లతేలి కనీసం నడిచేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే స్థితిలో ఉన్నాయి. వాహనాలు సైతం ఈ మార్గాల్లో ప్రయాణిస్తూ తరచూ మరమ్మతులకు గురికావడంతో పాటు వాహనదారులు గాయాలబారిన పడుతున్నారు. ఇవీ ఎల్ఎన్‌పేట మండలం బొత్తాడసింగి, వజ్రపుకొత్తూరు మండలం బెండికొండ వద్ద రోడ్ల దుస్థితి.. ఈ మార్గాల్లో ప్రయాణమంటేనా ప్రజలు హడలెత్తే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




ఎల్ఎన్‌పేట/వజ్రపుకొత్తూరు: రాళ్లు తేలిన బొత్తాడసింగి, బెండికొండ వద్ద రోడ్లు